మత్స్యం.. మాయం



జూ పార్కులో ఫిష్ అక్వేరియం



అక్వేరియం బయట గోడలపై ఖాళీ బాక్స్‌లు



అక్వేరియం లోపల చేపలు లేని బాక్స్‌లు

జూలో బోసిపోయిన ఫిష్ అక్వేరియం

- 'మీనాలోకం'కు తగ్గిన సందర్శకుల తాకిడి
- సగానికి పైగా కనుమరుగైన రంగురంగుల చేపలు
- మూలకు చేరిన అక్వేరియం బాక్సులు
- పునరుద్ధరించాలని కోరుతున్న పర్యాటకులు

ఆరిలోవ:

జూ.. ఈ పేరు వినగానే ఎన్నో రకాల జంతువులు, పక్షులు ఉంటాయని, వాటిని చూసి ఆనందించాలని భావిస్తాం. ఇందిరాగాంధీ జూ పార్కులో ఫిష్ అక్వేరియం కూడా ఉంది. అందులో పలు జాతులకు చెందిన రంగురంగుల చేపలు సందర్శకులను కనువిందు చేసేవి. జూలో ఓ పక్క వివిధ రకాల వన్యప్రాణులు, పక్షులు.. మరోపక్క రకరకాల అందమైన చేపలు పర్యాటకులను ఎంతో ఆకర్షించేవి. ఫిష్ అక్వేరియంలోని బాక్సుల్లో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరించేవి. జూకు వెళ్లే వారంతా ఈ అక్వేరియాన్ని కూడా సందర్శించి మురిసిపోయేవారు. దీంతో ఇక్కడ నిత్యం సందడిగా ఉండేది. ఇదంతా ఒకప్పటి మాట. అప్పుడున్న సందడి ఇప్పుడు కానరావడం లేదు. రంగురంగుల చేపలు కనుమరుగయ్యాయి. మత్స్యాలు తిరిగే బాక్సులు ఖాళీగా మారి మూలకు చేరాయి. దీంతో బోసిపోయిన అక్వేరియం వైపు సందర్శకులు కన్నెత్తి చూడటం మానేశారు. ప్రస్తుతం నాలుగైదు రకాల చేపలు మాత్రమే ఒంటరిగా అక్వేరియం బాక్సుల్లో తిరుగుతున్నాయి.

ఆదాయం నిల్..

కార్తీక మాసం, వేసవి సెలవుల్లో ఎక్కువగా పిల్లలను ఈ మీనా లోకం ఆకర్షించేది. దీని ద్వారా జూకు బాగా ఆదాయం లభించేది. ఇప్పుడు అక్వేరియంలో చేపలు లేకపోవడంతో ఎవ్వరూ వెళ్లడం లేదు. దాని ద్వారా లభించే ఆదాయానికి కూడా గండిపడింది. అప్పటి నుంచి ఉన్న చేపలు మృత్యువాతపడటం, వాటి స్థానంలో కొత్త చేపలు తీసుకురాకుండా వదిలేయడంతో అక్వేరియంలో బాక్సులు ఖాళీ అయ్యాయి. అవే ఎక్కువగా అక్వేరియంలో ఉన్నాయి. మరికొన్ని ఖాళీ బాక్సులను అక్వేరియం బయట గోడలపై వరుసగా పేర్చేశారు. అక్వేరియం నిర్వహణను కూడా గాలికొదిలేశారు. దీంతో సందర్శకులు మీనాలోకం వైపు పోవడం లేదు. జూ అధికారులు స్పందించి అక్వేరియంను మళ్లీ పునరుద్ధరించాలని సందర్శకులు కోరుతున్నారు.

15 రకాల అరుదైన చేపలు



ఒంటరిగా అలిగేటర్ ఫిష్

జూ పార్కులో సందర్శకులకు వినోదం అందించేందుకు జూ అధికారులు 2012లో 'మీనాలోకం' పేరుతో అక్వేరియం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడ వన్యప్రాణులతో పాటు వివిధ రకాల చేపల సందర్శకులను ఆకట్టుకునేవి. ఇందులో నియాన్ టెట్రా, గ్లో టెట్రా, జీబ్రా డానియో, అలిగేటర్ ఫిష్, పిరానా ఫిష్, రెయింబో షార్క్, వైట్ షార్క్, బ్లాక్ షార్క్, గోల్డ్ ఫిష్ తదితర 15 రకాల అరుదైన చేపలను విడిచిపెట్టారు. ఏనుగుల ఎన్‌క్లోజర్‌కు ఎదురుగా సుమారు 200 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలంలో ప్రత్యేకంగా అక్వేరియం నిర్మించారు. దీనిలోకి వెళ్లేందుకు పెద్దలకు రూ.4, పిల్లలకు రూ.2 చొప్పున టిక్కెట్ తీయాలి. ప్రవేశ రుసుం తక్కువ కావడంతో లోపల రంగుల చేపలు చూడాలనే ఆశతో జూకు వెళ్లిన సందర్శకులు మీనాలోకాన్ని కూడా సందర్శించే వారు.

క్లుప్తంగా

నేడు, రేపు కల్చరల్ ఫెస్ట్



ఏయూలో కల్చరల్ ఫెస్ట్ బ్యానర్ ప్రదర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కమిటీ వర్సిటీ కార్యదర్శి వెంకటరమణ కోరారు. ఈమేరకు సోమవారం ఏయూలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో ఫ్లాష్‌మాబ్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి డి.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులందరూ రెండు రోజులపాటు జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో యూనివర్సిటీలోని అన్ని విభాగాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పాటలు, డ్యాన్స్‌లు, స్కిట్‌లు, ఇతర కార్యక్రమాలు ప్రదర్శిస్తారని, విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏయూ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆర్.హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న కుక్కలు



ముడసర్లోవ రహదారిలో కుక్కల గుంపు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో వీధికుక్కలు స్థానిక ప్రజలను హడలెత్తిస్తున్నాయి. బీఆర్‌టీఎస్ రోడ్డు, ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రహదారుల్లో గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. ఆయా రోడ్లలో వాకింగ్‌కు వెళ్తున్న వారిని భయపెడుతున్నాయి. దీన్‌దయాల్‌పురం నుంచి రామకృష్ణాపురం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు, రిజర్వాయర్ వెనుక ఆరిలోవ ఆఖరి బస్టాప్ నుంచి డంపింగ్ యార్డు వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో వందల కొద్దీ యువకులు, వృద్ధులు, మహిళలు వాకింగ్ చేస్తుంటారు. అక్కడ కుక్కలు గుంపులుగా పరుగులెడుతున్నాయి. ఒక్కోసారి వాకర్లపై దాడి చేస్తున్నాయి. దీన్‌దయాల్‌పురం వద్ద జీవీఎంసీ కుక్కల ఆపరేషన్ కేంద్రంలో బయట నుంచి తీసుకొచ్చిన కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేస్తున్నారు. అనంతరం ముడసర్లోవ ప్రాంతంలో వాటిని విడిచిపెడుతున్నారు. దీంతో వీటి సంఖ్య ఇక్కడ పెరిగిపోయి పాదచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీధికుక్కలను అదుపు చేయాలని జీవీఎంసీ అధికారులను వాకర్లు, స్థానికులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వినతి



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మహారాణిపేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు కోరారు. సోమవారం పలు సమస్యలపై కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అనేక మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు కట్టలేక ఇబ్బందులకు గురవడంతోపాటు డ్రాప్‌ఔట్స్ అవుతున్నారని నాగరాజు తెలిపారు. రూ.4,800 కోట్ల పైచిలుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో ఈ నిధులు విడుదల చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. దీని వల్ల కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజ్ కట్టాలని విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేసి ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జె.అభిషేక్, ఎ.పవన్ కల్యాణ్, కె.శివరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న చినజీయర్ స్వామి

ఎంవీపీకాలనీ: శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి సోమవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన ఉదయం 10.30 గంటలకు ఆలయానికి చేరుకున్నారు. స్వామీజీకి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ కమిటీ ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణాన్ని చినజీయర్ స్వామి పరిశీలించి, ప్రసన్న ఆంజనేయ, వేంకటేశ్వర స్వాములను దర్శించుకున్నారు. ఆలయంలో మంగళశాసనం, అనుగ్రహ భాషణం కార్యక్రమాల్లో పాల్గొని భక్తులు ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతంగా జీవించవచ్చన్నారు. ఉత్తరాంధ్రలో ఆయుర్వేద ఆస్పత్రి ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని, ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని స్వామీజీ తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో చినజీయర్ స్వామిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

స్మైల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రం



పిచ్చి మొక్కలు తొలగించడంతో పరిశుభ్రంగా స్మైల్ కార్యాలయ ఆవరణ



ఫుట్‌పాత్‌పై తొలగించిన ముళ్ల పొదలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖకు చెందిన స్టేట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(స్మైల్) కార్యాలయ ఆవరణాన్ని అధికారులు శుభ్రం చేయించారు. ఈ కార్యాలయ ఆవరణంతా ఎక్కడపడితే అక్కడ పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా మారింది. వాటిలో పాములు చేరి ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పాడి రైతులకు నిత్యం ఇక్కడ శిక్షణ ఇస్తుంటారు. పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో ఫుట్‌పాత్‌లు మూసుకుపోయాయి. ఈ సమస్యపై గత నెల 23న 'స్మైల్ కార్యాలయం.. పిచ్చి మొక్కల నిలయం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు స్మైల్ అధికారులు స్పందించారు. రెండు రోజుల పాటు కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను, ఫుట్‌పాత్‌లపై ముళ్ల పొదలను తొలగించారు. ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.

ఫార్మా కంపెనీలపై సుమోటోగా చర్యలు తీసుకోండి

- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతికి వినతిపత్రం అందిస్తున్న లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: తరచూ ప్రమాదాలకు కారణమవుతూ ప్రజల ప్రాణాలు హరిస్తున్న ఫార్మా పరిశ్రమలపై సుమోటోగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం న్యూఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ ఎస్.విజయభారతిని కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. ఇటీవల ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న రెడ్ క్యాటగిరీకి చెందిన ఫార్మా సంస్థల్లో ప్రమాదాలు, ప్రాణనష్టం జరిగిన విషయం ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎసెన్షియా, ఠాగూర్ ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం కలిగిందని, ఇటువంటి సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మానవ హక్కుల కమిషన్ స్పందించి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోండి

సీతమ్మధార: తమ కార్యాలయం పరిధిలోని తూర్పు, ఉత్తర నియోజకవర్గాలకు చెందిన యువతీ, యువకులంతా విధిగా కొత్త ఓటర్లుగా నమోదు కావాలని అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ కోరారు. సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ఈ రెండు నియోజకవర్గాల్లో 18, 19 ఏళ్ల వయసు నిండిన యువతీ, యువకులంతా సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తులు నింపి, అవసరమైన జెరాక్స్ కాపీలు జతచేసి ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో ఫొటో, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు జత చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 24లోగా కొత్త ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

న్యాయం చేయాలని కార్మికుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రైవేట్ ఆస్పత్రి ఉద్యోగులు, కార్మికులు

మహారాణిపేట: ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు కోరారు. విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఆస్పత్రిలో తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని, యాజమాన్యంపై కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో ప్రియాంక దండి

మద్దిలపాలెం: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ప్రియాంక దండి ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇసుకతోట మినీ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ కార్యక్రమంలో ఆమె కేక్ కట్‌చేసి నాయకులకు అందించారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వాహన ఇంధనం ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేవన్నారు. ప్రస్తుతం ఉన్న ఇంధనం ధరలు వాహనదారులకు భారమైపోయాయని చెప్పారు. గ్రీన్ టాక్స్, ఇన్సూరెన్స్ ధరలు బాగా పెరిగాయని, వేరే దారి లేక కష్టంగా ఉన్న ఈ రంగాన్ని వదల్లేక పోతున్నామని మినీ వ్యాన్ యజమానులు పేర్కొంటున్నట్లు తెలిపారు. అనంతరం రామ్‌నగర్‌లోని ఏఎస్ రాజా రక్తదాన కేంద్రంలో ప్రియాంక దండి ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు కాండవ గాయత్రి, నాయకులు మెహర్, నాగరాజు, వెంకటేష్ దేవర, ప్రసాద్, రమణ, ఇసుకతోట మినీ వ్యాన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఈతలో మెలకువలపై యువకులకు శిక్షణ



రుషికొండ బీచ్ వద్ద ఈతలో శిక్షణ పొందుతున్న యువకులు

కొమ్మాది: నీటి ప్రమాదాల్లో చిక్కుకునే వారిని కాపాడేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్(ఎన్ఐడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో ఈతలో శిక్షణ కార్యక్రమం రుషికొండ బీచ్‌లో సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. ఈతలో మెలకువలు, కెరటాల్లో చిక్కుకున్న వారిని సకాలంలో ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడే విధానం, ప్రాథమిక చికిత్స వంటి అంశాలపై పది రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ తరహా శిక్షణ పొందిన వారిని పర్యాటక శాఖ బోటు షికారు సిబ్బంది, లైఫ్ గార్డ్స్ వంటి విభాగాల్లో ఉపాధి కల్పన ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం 27 మంది యువకులు శిక్షణ పొందుతున్నారని తెలియజేశారు.

రెవెన్యూ సదస్సులకు బ్రేక్

సీతమ్మధార: ప్రజల సమస్యలు, భూ వివాదాల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు బ్రేక్ పడింది. ఈ నెల 6 నుంచి విశాఖ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు ఆగిపోవడం గమనార్హం. సీతమ్మధార మండల పరిధిలో వాస్తవానికి డిసెంబర్ 20 వరకు నిర్ణీత వేదికల్లో సదస్సులు జరగాల్సి ఉంది. ఈ నెల 6న రేసపువానిపాలెం రెవెన్యూ విలేజీ ప్రాంత ప్రజలకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ నెల 9న మద్దిలపాలెం ప్రాంత ప్రజలకు 109 సచివాలయం, 11న పెదవాల్తేరు ప్రాంత ప్రజలకు 99 సచివాలయం, 13న చినవాల్తేరు ప్రజలకు ఎంవీపీ కాలనీ లుంబినీ పార్కు ఏరియాలోని కల్యాణ మండపం, 16న వెంకోజీపాలెం ప్రజలకు ఎంవీపీ కాలనీ నేతాజీ పార్కులోని 105 సచివాలయంలో, 18న దొండపర్తి ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానాలో, 20న అల్లిపురం ఎక్స్‌టెన్సన్ వార్డు ప్రాంత ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానాలో సదస్సులు జరుగుతాయని సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ ప్రకటించడం తెలిసిందే. సోమవారం నాటి సదస్సు జరగలేదు. కాగా.. ఈ నెల 18, 20 తేదీల్లో దొండపర్తి, అల్లిపురం గ్రామాలకు అక్కయ్యపాలెం షాదీఖానాలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ రమేష్ సోమవారం 'సాక్షి'కి తెలిపారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వాహనాలను ఒక రోజు విడిచి ప్రజా రవాణాను వినియోగించాలని కోరారు. ఆరిలోవ పెదగదిలిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి బస్సులు, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చన్నారు.

ఫార్మసీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: డాక్టర్ దేవా హెచ్.పురాణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్, భాగస్వామి-మేనేజింగ్ డైరెక్టర్, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కన్సల్టింగ్ ఫర్మ్, పీ-ఏ, యూఎస్ఏ-యూకే సహకారంతో ఏయూ ఫార్మసీ కళాశాల కొత్త భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్ పురాణం ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు ప్రారంభించారు. డాక్టర్ దేవా హెచ్.పురాణం ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన తాజా పరికరాలను, పునర్నిర్మించి ఆధునికీకరించి గదులను రిజిస్ట్రార్‌కు చూపించారు. ల్యాబ్ స్థాపన, ఏర్పాటు ఉద్దేశాన్ని వివరించారు. పరిశ్రమ-అకాడమియా సంబంధం ప్రాముఖ్యతపై ముఖ్యంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో డీన్ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ కె.ఈశ్వరకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్, ప్రొఫెసర్ కె.బసవయ్య, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'లో భాగస్వాములుకండి



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ఏయూ వీసీ శశిభూషణరావు, అధికారులు

విశాఖ విద్య: వికసిత్ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ జి.శశిభూషణరావు కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం గవర్నర్ కార్యాలయం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో వీసీతో కూడిన ఏయూ అధికారుల బృందం పాల్గొంది. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల ప్రధాన ఉద్దేశం, నిర్వహణ తదితర అంశాలను రాజ్ భవన్ అధికారులు వివరించారు. ముందుగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, అర్హత సాధించిన వారిని వ్యాసరచన పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వ్యాసరచన పోటీలకు 10 అంశాలను ఇచ్చినట్లు చెప్పారు. వీరిలో విశ్వవిద్యాలయాల వారీగా విద్యార్థులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపాలని సూచించారు. ఈ పోటీల నిర్వహణ, విధి విధానాలు తదితర అంశాలను వర్చువల్ సమావేశంలో వివరించారు. పోటీల ప్రత్యేక నియమావళి, సూచనలు అనుసరిస్తూ ఎంపిక ప్రక్రియ జరపాలన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల వ్యాసాలను పరిశీలించి, ఎంపిక చేసే విధానం, నిపుణుల ఎంపిక తదితర అంశాలను వివరించారు. సమావేశంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి.రాంబాబు, ఆచార్య అన్నపూర్ణ, ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య ఎ.నాగ హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి



సదస్సు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

విశాఖ విద్య: విద్యార్థులు స్నేహ భావంతో మెలిగి చదువుల్లో రాణించాలని ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు అన్నారు. సాంఖ్యాక శాస్త్ర విభాగం ఓరియంటేషన్ ప్రొగ్రాంను సోమవారం ఏయూ టీఎల్ ఎన్ హాల్లో సోమవారం నిర్వహించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ మునిస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎంవిఆర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు పరస్పర స్నేహభావంతో మెలగాలని సూచించారు. చెడు మార్గంలో పడకుండా మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించేలా కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ప్రముఖులను స్ఫూర్తిగా తీసుకుంటూ జీవితంలో ఎదగాలని సూచించారు. బ్యాడ్మింటన్, వాలీబాల్ తదితర ఆటల పోటీల విజేతలను మెడల్స్‌తో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న జీవీఎంసీ జోన్-3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి మూడు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించిన ఫిర్యాదుల సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గోపన్న, యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-2 పరిధిలో 15 ఫిర్యాదులు

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 మధురవాడ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 15 వినతులు వచ్చాయి. ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ఫణిరాం ఆధ్వర్యంలో ఫిర్యాదులు స్వీకరించారు.

- 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ-కార్‌షెడ్ జంక్షన్ వద్ద హైవేను ఆనుకుని జీవీఎంసీ గిఫ్ట్‌డీడ్ చేసిన సర్వే నంబర్ 248/10లో ఉన్న సుమారు 672 గజాల స్థలాన్ని కాపాడాలని చంద్రంపాలేనికి చెందిన పిళ్లా అప్పలనాయుడు ఫిర్యాదు చేశాడు.
- పీఎం పాలెం, రేవళ్లపాలెం భాస్కరనగర్ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, నగరంపాలెం, బక్కన్నపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం కోసం, పీఎం పాలెం గాయత్రినగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ 1వ నంబర్ బ్లాక్‌లో కొత్త ట్యాంక్ ఏర్పాటు.. ఇలా జోన్‌లోని 9వ వార్డుల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై 15 అర్జీలు వచ్చాయి. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.